జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 14 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

## సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

- నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ
- 3నుంచి నాలుగో పంప్ హౌస్ మధ్యలో 532 ఎకరాల భూసేకరణ త్వరిత గతిన పూర్తి చేయాలి
- జూలూరుపాడు టన్నెల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- సాగర్ ఆయకట్టు పంటలకు మరోసారి నీటిని విడుదల చేయాలి



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 13, (ప్రజాజ్యోతి)** సీతారామ ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు నీటి అవసరాలు, ప్రాజెక్టు పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు గురువారం సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతులకు త్వరితగతిన

మిగతా 2 లో...

## భ్రష్టు పట్టిస్తున్నది..

7 లో..

# జిల్లా అధ్యక్షులేనా..?

- కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో దూసుకుపోతున్న కమలం
- భద్రాద్రిలో వరుస నాయకత్వ మార్పులు.. ఆశించిన స్థాయిలో ఎదగని పార్టీ
- జీవీకే మనోహర్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోనేరు చిన్ని, రంగా కిరణ్ నాయకత్వాలపై పార్టీలో చర్చ
- కేడర్ ఉన్నా.. నాయకత్వ సమన్వయం లేక వెనుకబడుతోందనే విమర్శలు
- పార్టీని బలోపేతం చేయాల్సిన వారే బలహీనతకు కారణమవుతున్నారనే ఆరోపణలు



**కేంద్రంలో అధికారంలో ఉండటంతో పాటు పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ నినాదంతో బీజేపీ దూసుకుపోతున్నా.. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదలుకొని ఇప్పటి ప్రత్యేక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం పార్టీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.**

## ముందేమీ చెప్పలేదు.. ఇప్పుడు కొన్ని చెప్పారు!



- రూ.600 కోట్ల ప్రతిపాదిత రుణంపై తొలి సారి వివరణ
- డీపీఆర్ టెండర్ రద్దు.. ఆన్ లైన్ లో కొత్తగా టెండర్
- ప్రాజెక్టు రద్దు కాదు.. డీపీఆర్ ప్రక్రియకే బ్రేక్
- విలేకరుల సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్ట్ 13, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం కార్పొరేషన్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూసీఎఫ్ (అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్) పథకం సహాయంతో ప్రతిపాదించిన రూ.600 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టు వ్యవహారంపై ఇంతకాలం పెద్దగా వివరాలు వెల్లడించని ప్రజాప్రతినిధులు.. తాజాగా కొన్ని అంశాలపై స్పందించారు. డీపీఆర్ టెండర్ ప్రక్రియపై ఆరోపణలు, అభ్యంతరాలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రస్తుత టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. అయితే రూ.600 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనను కొనసాగిస్తామని, డీపీఆర్ కోసం కొత్తగా ఆన్‌లైన్ టెండర్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తొలుత కొత్తగూడెం అభివృద్ధికి రూ.200 కోట్ల ప్రతిపాదన ఉండగా.. తాను వ్యక్తిగతంగా ప్రయత్నించి దానిని రూ.600 కోట్లకు పెంచినట్లు

మిగతా 2 లో...


## పిఆర్ సి ని ప్రకటించి _తక్షణమే పెండింగ్ డిఏలను విడుదల చేయాలి

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తాసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన యుటిఎఫ్ నాయకులు




2లో...

## డీపీఆర్ టెండర్ రద్దు!...
# ప్రజాజ్యోతి ఎఫెక్ట్




- రూ.600 కోట్ల ప్రతిపాదిత ప్రాజెక్టుపై వరుస కథనాలు..
- డీపీఆర్ ప్రక్రియపై వచ్చిన అభ్యంతరాలపై స్పందన
- ప్రస్తుత టెండర్ రద్దు.. ఆన్‌లైన్‌లో కొత్తగా టెండర్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్ట్ 13, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం కార్పొరేషన్‌లో ప్రతిపాదించిన రూ.600 కోట్ల ప్రాజెక్టు డీపీఆర్ వ్యవహారంపై ప్రజాజ్యోతి వరుస కథనాలతో లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పుడు కీలక మలుపునకు దారితీశాయి. డీపీఆర్ టెండర్ విధానం, కన్సల్టెన్సీ ఫీజు, ముందస్తు చెల్లింపులు, ప్రాజెక్టు రుణభారం వంటి అంశాలపై ప్రజాజ్యోతి వరుసగా కథనాలు ప్రచురించగా.. ఈ వ్యవహారంపై పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ ప్రస్తుత డీపీఆర్ టెండర్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

**దీంతో ప్రజాజ్యోతి వరుస కథనాల తర్వాత డీపీఆర్ టెండర్ ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకుంది. దీంతో ప్రజాజ్యోతి పై పట్టణ వాసులు ప్రశంశల జల్లు కురిపిస్తున్నారు.**

**ఇకపై ఆన్‌లైన్‌లో కొత్తగా టెండర్ నిర్వహించి డీపీఆర్ తయారీకి సంస్థను ఎంపిక చేస్తామని తెలిపారు. అయితే రూ. 600 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనను మాత్రం రద్దు చేయడం లేదని స్పష్టం చేశారు.**

## పి ఆర్ సి ని ప్రకటించి _తక్షణమే పెండింగ్ డిఏలను విడుదల చేయాలి




**కొత్తగూడెం కలెక్టరేట్ ఆగస్టు 13 ప్రజాజ్యోతి** పి ఆర్ సి ని తక్షణమే ప్రకటించి పెండింగ్లో ఉన్న డీఎలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రాజు ఆధ్వర్యంలో గురువారం పాల్వంచ తాసిల్దార్ ధారా ప్రసాదును కలిసి హలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజు మాట్లాడుతూ 36 నెలల కాలయాపన చేస్తూ పి ఆర్ సి ప్రకటించకపోవడం విచారకరమని అన్నారు , ఇప్పటికైనా తక్షణమే పిఆర్ సి ప్రకటించాలని, అదేవిధంగా పెండింగ్ డి ఎ లను వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పండిట్ పీఈటీల అప్ గ్రేడేషన్ చేపట్టాలని, కొత్త పాఠశాలల కన్నా ఉన్న పాఠశాలను బాగు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, టి ఎస్ టి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్కే పాషా , పాల్వంచ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, హరి సింగ్, సోషల్ మీడియా కన్వీనర్ బి మంగీలాల్, పాల్వంచ మండల ఉపాధ్యక్షులు ఏ విజయభాస్కర్, ఉపాధ్యాయులు యశోద, రాజకుమారి, లక్ష్మి, ఆస్మా , నాగ కుసుమాంబ, శ్రీ చిద్వి, ఓబులాంబ, కృష్ణమోహన్, శ్రీనివాస్, వెంకన్న,ఫాల్గుణ, వీటిఆర్ మోహన్ రావు, రాణి, సత్యవాణి, అనురాధ జయసుధ, జె సునీత, రాంబాబు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ముందేమీ చెప్పలేదు.. ఇప్పుడు కొన్ని చెప్పారు!

(మొదటి పేజీ తరువాయి... )

కూనంనేని వెల్లడించారు. అయితే డీపీఆర్ తయారీకి అనుసరించిన విధానంపై ఆరోపణలు రావడంతో ప్రస్తుత టెండర్ను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి ప్రాజెక్టును రద్దు చేయడం లేదని, కేవలం ప్రస్తుత డీపీఆర్ టెండర్ను మాత్రమే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇకపై ఆన్లైన్ టెండర్ విధానంలో పారదర్శకంగా కొత్త సంస్థను ఎంపిక చేసి డీపీఆర్ తయారు చేయిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఇంతకుముందు రూ.600 కోట్ల ప్రతిపాదనలో నిధుల సమీకరణ ఎలా ఉండబోతోంది? కేంద్రం వాటా ఎంత? రాష్ట్రం ఎంత భరిస్తుంది? కార్పొరేషన్ ఎంత రుణం తీసుకోవాలి? రుణాన్ని ఎలా తిరిగి చెల్లించాలి? వంటి అంశాలపై స్పష్టమైన వివరాలు పెద్దగా బయటకు రాలేదు. తాజాగా ఈ అంశంపై స్పందించినప్పటికీ.. పూర్తి ఆర్థిక నమూనా, రుణ కాలపరిమితి, వడ్డీ, తిరిగి చెల్లింపు విధానం వంటి అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు డీపీఆర్ టెండర్ వ్యవహారంపై ఇప్పటికే రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తక్కువ వ్యవధిలో టెండర్ ప్రక్రియ నిర్వహించడం, ఒక్క సంస్థకు సంబంధించిన అంశాలు, రూ.9.60 కోట్ల డీపీఆర్ ఫీజు వంటి విషయాలపై ప్రశ్నలు లేవనెత్తారు. కానీ వాటిపై సరైన వివరాలు వెల్లడించలేకపోయారు. ఇప్పటికే వచ్చిన ఆరోపణలు, జరిగిన పరిణామాలపై కూడా ఇంతవరకు పెద్దగా స్పందించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత డీపీఆర్ టెండర్ను రద్దు చేసి, కొత్తగా ఆన్లైన్ విధానంలో ప్రక్రియ చేపడతామని ఎమ్మెల్యే ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటివరకు మౌనంగా ఉన్న అంశాలపై ఇప్పుడు ఒక్కొక్కటిగా వివరాలు బయటకు వస్తుండటంతో.. రూ.600 కోట్ల ప్రతిపాదిత ప్రాజెక్టుపై ఇకపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# సీతారామ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి... )

సాగునీరు అందేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల కోరారు రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని, మూడో పంప్హౌస్ నుంచి నాలుగో పంప్హౌస్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూసేకరణ ప్రక్రియను రూ.45 కోట్లతో చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములన్నిసస్యశ్యామలం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆయకట్టు రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భూ సేకరణ, పైప్ లైన్ నిర్మాణం పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్హౌస్ నుంచి దమ్మపేట మండలం లోని నాలుగో పంప్హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. అయితే నాలుగో పంప్హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు గోదావరి జలాలను కాలువల ద్వారా అందించే ప్రతిపాదనలకు బదులుగా పైప్లైన్ద్వారా నీటిని అందించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి, నిధులు విడుదల చేసి పనులను చేపడితే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు తమ భూములను కోల్పోవాల్సిన అవసరం ఉండదని మంత్రి తుమ్మల వివరించారు.

> »» **జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం చేయండి.**

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని మంత్రి తుమ్మల కోరారు. సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కొనసాగితే ఆయకట్టు పరిధిలోని పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను రక్షించేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి సాగునీటిని విడుదల చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమారరెడ్డి, రెండు మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి, రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.

# రూ.600 కోట్ల ప్రాజెక్టుపై అపోహలు వద్దు

- **డీపీఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం..**
- **విమర్శలకు తావులేకుండా ఆన్ లైన్ టెండర్లకు ఆదేశం..**
- **రూ.9.60 కోట్ల అవినీతి ప్రచారం అవాస్తవం: ఎమ్మెల్యే కూనంనేని**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 13, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం కార్పొరేషన్ కు ప్రతిపాదించిన రూ.600 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టుపై అనవసర అపోహలు సృష్టించొద్దని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద పట్టణానికి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేశామని, డీపీఆర్ టెండర్ ప్రక్రియపై విమర్శలు రావడంతోనే మరింత పారదర్శకత కోసం ఆన్ లైన్ టెండర్లకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం కొత్తగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఇంకా ఏర్పడి ఏడాది కూడా పూర్తి కాలేదని, ఇలాంటి సమయంలో అభివృద్ధికి వచ్చే అవకాశాలను అడ్డుకోవద్దని కూనంనేని అన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్రం, రాష్ట్రం, బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూరే విధానం ఉందని వివరించారు. ఈ పథకం కింద కేంద్రం 25 శాతం, రాష్ట్రం 25 శాతం, మిగిలిన 50 శాతం బ్యాంకు రుణం ద్వారా సమకూరుతుందని తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ కోసం రూ.600 కోట్ల నిధుల ప్రతిపాదనతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అయితే డీపీఆర్ తయారీకి 1.6 శాతం రుసుము నిర్ణయించడాన్ని చూపుతూ రూ.9.60 కోట్ల అవినీతి జరిగిందంటూ ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. ఇతర పట్టణాల్లో కూడా ఇదే తరహాలో డీపీఆర్ రుసుముతో టెండర్లు జరిగాయని పేర్కొన్నారు. అయితే డీపీఆర్ టెండర్ ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు రాకుండా ఉండేందుకే ప్రస్తుత విధానాన్ని మార్చి ఆన్ లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని కూనంనేని స్పష్టం చేశారు. దీంతో తక్కువ రుసుముతో డీపీఆర్ తయారు చేయగల సంస్థలు కూడా కొత్త టెండర్ లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇకనుండి ప్రజాప్రతినిధులు లేదా అధికారులు ఎవరైనా తప్పులకు పాల్పడితే చర్యలు తప్పవని, అక్రమాలు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యాసంస్థలు, క్రీడా ప్రాంగణాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని కూనంనేని తెలిపారు. సమావేశంలో మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పాండురంగపురం తండాలో లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

- **25 కేవీ ట్రాన్స్ఫారమ్ ఏర్పాటు : సర్పంచ్ అజ్మీరా రుక్మ కృషి**



పాల్వంచ, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి): పాల్వంచ మండలం పాండురంగపురం తండా గ్రామపంచాయతీ పరిధిలో కొంతకాలంగా నెలకొన్న లో–వోల్టేజ్ విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన గ్రామ సర్పంచ్ అజ్మీరా రుక్మ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ మేరకు రూరల్ కరెంట్ ఏడీఈ హుస్సేన్, ఏఈ రవితో సర్పంచ్ రుక్మ చర్చించి గ్రామంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గురువారం పాండురంగపురం తండా గ్రామపంచాయతీలో 25 కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. కొత్త ట్రాన్స్ ఫారమ్ ఏర్పాటు చేయడంతో గ్రామంలో లో–వోల్టేజ్ సమస్య తగ్గి విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ అజ్మీరా రుక్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా రుక్మ, ఉపసర్పంచ్ మార్గం అంకయ్య, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అందని బట్టలు

- పంద్రాగస్టుకు పాత బట్టలేనా?
- నెలలు గడుస్తున్నా అందని వైనం
- విద్యార్థుల ఎదురుచూపులు
- కాలయాపన చేయకుండా బట్టలు అందజేయాలని డిమాండ్
- విద్యార్థుల ఎదురుచూపులు ఫలించేనా?



ఇల్లందు, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి) ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఉచిత దుస్తులు సకాలంలో అందక పోవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు విద్యార్థులకు దుస్తులు అందకపోవడంతో తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. పంద్రాగస్టు వేడుకలు సమీపిస్తున్న తరుణంలోనైనా కొత్త దుస్తులు అందుతాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యూనిఫాం దుస్తులు అందించాల్సి ఉన్నప్పటికీ, పంపిణీలో జరుగుతున్న జాప్యం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి కొత్త దుస్తుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు నిరాశే మిగులుతుంది.

### పంద్రాగస్టుకైనా అందేనా?

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విద్యార్థులు కొత్త యూనిఫాంలో హాజరుకావాలని ఆశిస్తున్నారు. అయితే ఇప్పటివరకు దుస్తులు అందకపోవడంతో పంద్రాగస్టు నాటికైనా బట్టలు వస్తాయా? లేక పాత దుస్తులతోనే వేడుకలకు హాజరు కావాల్సి వస్తుందా? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు యూనిఫాం దుస్తులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వాటిని సకాలంలో అందించాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### నెలలు గడుస్తున్నా జాప్యమే...

విద్యార్థులకు అవసరమైన దుస్తుల సరఫరా, పంపిణీ విషయంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యను సేకరించి, అవసరమైన దుస్తులను ముందుగానే సిద్ధం చేసి పంపిణీ చేస్తే ఇలాంటి సమస్యలు తలెత్తేవి కావని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### విద్యార్థుల ఎదురుచూపులు ....

కొత్త యూనిఫాం దుస్తుల కోసం విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పాఠశాలకు ప్రతిరోజూ వెళ్లే విద్యార్థులకు యూనిఫాం దుస్తులు ఎంతో అవసరం. ప్రభుత్వం ఉచితంగా అందించే దుస్తులు వస్తాయన్న నమ్మకంతో చాలామంది తల్లిదండ్రులు కొత్త దుస్తులు కొనుగోలు చేయకుండా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో మరింత ఆలస్యం జరిగితే విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

### కాలయాపనకు స్వస్తి పలకరూ..!

విద్యార్థులకు ప్రతి ఏటా అందించే దుస్తుల పంపిణీలో ఇకనైనా కాలయాపన చేయకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలల వారీగా అవసరాలను గుర్తించి, దుస్తులు అందని విద్యార్థులందరికీ వెంటనే యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో సకాలంలో అమలు అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కోరుతున్నారు.

### ఎదురుచూపులు ఫలించేనా?

పంద్రాగస్టు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు కొత్త యూనిఫాం దుస్తులు అందిస్తారా? లేక ఈ ఏడాది కూడా పాత దుస్తులతోనే పాఠశాలకు రావాల్సిన పరిస్థితి ఉంటుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, విద్యార్థులకు అవసరమైన దుస్తులను వెంటనే అందించి వారి ఎదురుచూపులకు తెరదించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన



కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 13,(ప్రజా జ్యోతి) పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాథపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి గురువారం మాదిరిగా 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా ఆలయ అర్చకులు సువర్ణ పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నివేదన ,నీరాజన, మంత్రపుష్పం పూజలు చేశారు .ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుకా చౌదరి జన్మదిన వేడుకలు



ఇల్లందు, ఆగస్ట్ 13 (ప్రజా జ్యోతి) మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి జన్మదిన వేడుకలను గురువారం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెకె కాలనీలోని కార్మికవాడలో మహిళలతో కలిసి జన్మదిన కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోచికొండ శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా రేణుకా చౌదరి ఉమ్మడి ఖమ్మం జిల్లాను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో రేణుకా చౌదరి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహిళలు చోటి, అనిత, నర్సమ్మ, విజయలక్ష్మి ,యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలు

ఇల్లందు, ఆగస్ట్ 13 (ప్రజా జ్యోతి) కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్, ఐఎన్టీయుసి సెక్రటరీ జనరల్, సింగరేణి కోల్ మెన్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ బి. జనక్ ప్రసాద్ జన్మదిన వేడుకలను గురువారం ఇల్లందు ఏరియా సింగరేణి కోల్మెన్స్ కాంట్రాక్ట్ అండ్ లేబర్ యూనియన్ ఇంచార్జ్, ఐఎన్టీయుసీ సెంట్రల్ జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక జెకె సివిల్ కార్యాలయం వద్ద అసంఘటితరంగా కార్మికుల తో కలిసి కేక్ ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న అసంఘటిత రంగా కార్మికులకు సింగరేణి కార్మికులకు ఇచ్చేలా ప్రతి సంవత్సరం వచ్చే లాభాల వాటాలో రూ. 5 వేలు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. బ్రదర్ 12 సంవత్సరాలుగా కనీస వేతనాలు పెరగకపోవడంతో, జనక్ ప్రసాద్ చొరవ తీసుకొని మూడు దఫాలుగా సమావేశాలను ఏర్పాటు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి వారికి కనీస వేతనాలు కూడా పెంచడం జరిగిందన్నారు. త్వరలో వీరికి హాస్పిటల్ వసతి కూడా అందుబాటులోకి తీసుకురాబోతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జనక్ ప్రసాద్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నత పదవులను అధిరోహించాలని, కార్మికులకు మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి సెంట్రల్ నాయకులు కొండూరు చిన్న, మోహన్ రావు, అసంఘటిత కార్మికులు సాంబ, చారి, నవీన్, దుర్గ ప్రసాద్, పండు, లింగమూర్తి, గంగ, దుర్గ, సుజాత, విజయ, రాజేశ్వరి, ప్రణయ్, మల్లేశ్వరి, జమున, జగన్, రూప పాసి, వెంకన్న, పూర్ణ, ప్రశాంత్, సుధ తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచ గాంధీ నగర్ లో ఘనంగా ప్రారంభమైన శ్రావణమాస ఉత్సవాలు

- పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వర రావు దంపతులు

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 13 ,(ప్రజాజ్యోతి) శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా గురువారం పాల్వంచలోని గాంధీ నగర్ లో శ్రావణ మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి, ప్రతి సంవత్సరం గాంధీ నగర్ లోని పెద్ద పాల చెట్టు కింద వెంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి శ్రావణ మాస మొదటి గురువారం సందర్భంగా అమ్మవారి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు ఈ సందర్భంగా పూజారి గడ్డం భాస్కర్ దాస్ ఆధ్వర్యంలో శ్రీ సూక్తి పురుష సూక్తి దుర్గ సూక్తి నీలు సూక్త పంచసూక్తములతో పాటు లలిత సహస్రనామం త్రిశతి శ్రీదేవి ఖడ్గమాల తో కుంకుమార్చన ప్రత్యేక పూజలు గాంధీనగర్ 44వ డివిజన్ కార్పొరేటర్ ఈసంశెట్టి విశ్వేశ్వర రావు యూన్సీ దంపతులచే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమములో పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ చౌహన్ , ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరావు, కేసు పాక వెంకటేశ్వర్లు, ఏదుకొండలు , లక్ష్మి , పద్మ ,నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో ఉన్న ప్రజాజ్యోతి విలేకరి గాడెపల్లి వీరభద్రంను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని)



కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 13,(ప్రజా జ్యోతి) పాల్వంచలో సీనియర్ జర్నలిస్ట్, ప్రజాజ్యోతి విలేకరి గాడెపల్లి వీరభద్రం ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని పాల్వంచ కు తీసుకు వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని ) ఆయనను పరామర్శించారు. గురువారం టీచర్స్ కాలనీలోని వీరభద్రం నివాస గృహంలో ఆయనను శస్త్రచికిత్స విషయమై అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎలాంటి సహాయం అయినా తన దృష్టికి తీసుకొస్తే తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు, కోనేరు చిన్ని వెంట కార్పొరేటర్లు హరిహరన్ యాదవ్, రావి రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ ఆ0తోటి పాల్, కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్ ఎస్ జె కె అహ్మద్, జొన్నాడ కృష్ణ, మాలంపాటి కిరణ్, అక్బర్ తదితరులు

## విద్యార్థులతో తిరంగా ర్యాలీ



**ఇల్లందు, ఆగస్ట్ 13 (ప్రజా జ్యోతి)** 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల, కళాశాల విద్యార్థులతో స్థానిక గోవింద్ సెంటర్ నుంచి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు సుమారుగా 2000 మందితో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు కావస్తున్నందున బిజెపి పార్టీ ఆదేశాల మేరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీకి సహకరించిన విద్యాసంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బాలగాని గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి సేనాపతి మురళీకృష్ణ, ఆఫీస్ సెక్రటరీ కుమార్, పట్టణ అధ్యక్షురాలు సుచిత్ర పాసి, సీనియర్ నాయకులు, మాధవ్, మహేష్, రజత్ కోరి, శివం, సంతోష్, అజయ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయి వ్యాసరచన పోటీలు



**పినపాక,ఆగష్టు 12(ప్రజాజ్యోతి)** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి, సృజనాత్మకతను పెంపొందించే ఉద్దేశంతో మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గురువారం పినపాక జెడ్పీహెచ్ఎస్‌లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా మొత్తం 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు విభాగంలో 40 మంది, హిందీలో 16 మంది, ఇంగ్లిష్‌లో 39 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రామిరెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జీపీడీపీపై కేంద్రం కొత్త నిబంధనలు: ఎంపీవో వెంకటేశ్వరరావు



**పినపాక,ఆగష్టు 13 (ప్రజాజ్యోతి)** గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చిందని ఎంపీవో వెం కటేశ్వర రావు తెలిపారు. గురువారం పినపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మాట్లాడారు. కొత్త నిబంధనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామా ల అవసరాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను గుర్తించనున్నట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు, అవసరాలను సేకరించి వాటిని జీపీడీపీలో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించడం ద్వారా స్థానికంగా అవసరమైన పనులకు ప్రాధాన్యత కల్పించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సంబంధిత శాఖల సమన్వయంతో జీపీడీపీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఎంపీవో వెల్లడించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి జీపీడీపీ కీలకమని, ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.

# అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరి రాజ్యం?

- **రెండు రోజులుగా వస్తున్న వార్తలు.. స్పందన మాత్రం శూన్యం!**
- **అశ్వరావుపేట ప్రజా జ్యోతి ఆగస్టు 13 రోగులను పట్టించుకునే నాథుడే కరువు.. ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేతుల్లోనే ఆసుపత్రి నడుస్తోందా?**




**అశ్వరావుపేట:** ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు భరోసా కల్పించే వైద్యాలయం. కానీ అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఆసుపత్రి సేవలు, సిబ్బంది వ్యవహారశైలిపై వార్తలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### ››› వార్తలు వస్తున్నా.. స్పందన ఏది?

ఆసుపత్రిలో రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం వంటి అంశాలపై వరుస కథనాలు వచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన వివరణ లేకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సమస్యలు ఉంటే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని, ఆరోపణలు నిజం కాకపోతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

### ››› ఇద్దరి చేతుల్లోనే ఆసుపత్రి?

ఆసుపత్రిలో పనిచేస్తున్న ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి పరిపాలనా వ్యవహారాల్లో వారి జోక్యం అధికంగా ఉందని, కొందరు సిబ్బంది కూడా వారి మాటకే ప్రాధాన్యం ఇస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? అధికారులు దీనిపై విచారణకు సిద్ధంగా ఉన్నారా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

### ››› రోగుల పరిస్థితి ఏంటి?

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. ఉదయం నుంచి ఆసుపత్రిలో వేచి ఉండాల్సి వస్తే, వైద్యులు లేదా సిబ్బంది సమయానికి అందుబాటులో లేకపోతే వారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. రోగులకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలో ఎవరి మాట నడుస్తుందన్నది కాదు.. రోగికి సమయానికి వైద్యం అందుతోందా? లేదా? అన్నదే అసలు ప్రశ్న.

### ››› అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

అవుట్ సోర్సింగ్ సిబ్బంది బాధ్యతలు ఏమిటి? వారికి అప్పగించిన పనులు ఏమిటి? ఆసుపత్రి పరిపాలనలో వారికి ఎంతవరకు అధికారం ఉంది? వారి పనితీరును పర్యవేక్షించేది ఎవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఆసుపత్రిలో సిబ్బంది హాజరు రిజిస్టర్ ను అధికారులు తనిఖీ చేస్తున్నారా?
అవుట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించిన విధులు ఏమిటి?
ఆసుపత్రి పరిపాలనలో వారి పాత్ర ఎంతవరకు?
రోగుల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉందా?
గత రెండు రోజులుగా వచ్చిన వార్తలపై అధికారులు విచారణ చేపట్టారా?
రోగులకు సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే దానిపై ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయా?
రోగుల ఆసుపత్రి.. పెత్తనం ఎవరిది?
ప్రభుత్వ ఆసుపత్రి ప్రజల సొమ్ముతో నడుస్తున్న ప్రజా వైద్య కేంద్రం. ఇక్కడ అధికారుల పర్యవేక్షణ ఉండాలి.. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి.. రోగులకు గౌరవంగా వైద్యం అందాలి.

## రేపటి తరానికి విలువలతో కూడిన విద్య అందించాలి

- **మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో బ్రహ్మ కుమారీస్ స్ఫూర్తిదాయక ప్రసంగం.**



**పాల్వంచ, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి):** విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, సంస్కారంతో ఎదగాలని బ్రహ్మ కుమారీస్ సంస్థ సభ్యులు సూచించారు. పాల్వంచలోని మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారీస్ సభ్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో నాణ్యమైన విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, గురువుల పట్ల మర్యాద ఎంతో ముఖ్యమని తెలిపారు. చిన్న వయసు నుంచే మంచి అలవాట్లను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవి దోహదపడతాయని వివరించారు. జీవితంలో సరైన మార్గాన్ని ఎలా ఎంచుకోవాలి, నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎలా సాధించాలి, కష్టాలను ఎదుర్కొంటూ ఎలా ముందుకు సాగాలి అనే అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కుటుంబంలో తల్లిదండ్రులను గౌరవించడం, గురువుల సూచనలు పాటించడం, క్రమశిక్షణతో మెలగడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సంస్థ సభ్యులతో పాటు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చి. వంశీ సార్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి అవకాశం కల్పించిన పాఠశాల ప్రిన్సిపాల్ రాజు సార్‌కు బ్రహ్మ కుమారీస్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "విద్యతో పాటు సంస్కారం.. మంచి భవిష్యత్తుకు పునాది" అనే సందేశాన్ని అందించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- **ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి నజ్ నిన్ తబసుమ్ సూచన**



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలంలో వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎర్రగుంట ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి నజ్ నిన్ తబసుమ్ సూచించారు. వాతావరణంలో మార్పులతో పాటు దోమల వ్యాప్తి, కలుషిత నీరు, అపరిశుభ్ర పరిసరాల కారణంగా దగ్గు, జలుబు, జ్వరం, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. చేతులను సబ్బుతో తరచూ శుభ్రం చేసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చి వైద్యులను సంప్రదించాలని నజ్ నిన్ తబసుమ్ తెలిపారు. అవసరమైన పరీక్షలు చేయించుకున్న అనంతరం వైద్యులు సూచించిన మందులను మాత్రమే వినియోగించాలని, సొంతంగా మందులు వాడ కూడ దన్నారు. జ్వరం ఉన్న సమయంలో తగినంత విశ్రాంతి తీసుకుంటూ నీరు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగీ అనుమానిత లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యశాలలకు రావాలని తెలిపారు. పరిసరాల్లో దోమల పెరుగుదలకు అవకాశం లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తే సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని ఆమె పేర్కొన్నారు.

# 'సామాజిక సేవా కార్యక్రమాల్లో సరిలేరు నీకెవ్వరు'

- శభాష్ అహ్మద్ భాయ్ అంటూ ప్రముఖుల ప్రశంసలు..!
- పేదలకు కష్టం వస్తే వెంటనే స్పందించే అహ్మద్ గుణం స్ఫూర్తి దాయకం..
- సేవా కార్యక్రమాల్లో మూడు దశాబ్దాలకు పైగా ఘన చరిత్ర







**పాల్వంచ, ఆగస్టు 13, ప్రజాజ్యోతి:** నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ సేవా కార్యక్రమాలు ఎంతోమందికి స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నాయి. "మానవ సేవయే మాధవ సేవ" అనే నినాదంతో, ఎటువంటి స్వార్థం లేకుండా, నిరుపేదలకు, బాధితులకు, పీడితులకు, నిస్సహాయులకు అండగా నిలుస్తూ విజయవంతంగా 33 సంవత్సరాల సుదీర్ఘ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 34వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేతాజీ యువజన సంఘం ప్రస్థానం పై ప్రత్యేక కథనం.చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు ఎస్. ఏ. ఖయ్యాం, రజియా బేగం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధైర్య సాహసాలను, ఆయన వీర గాథలను అహ్మద్ కు చెబుతూ పెంచడంతో అదే స్ఫూర్తితో పాల్వంచ పట్టణంలో 1993 సంవత్సరంలో ఆగస్టు 14న ఎస్.జె.కె అహ్మద్ స్థాపించిన నేతాజీ యువజన సంఘం ఓ యజ్ఞంలా వివిధ సేవా కార్యక్రమాలను చేసుకుంటూ నాటి నుండి నేటి వరకు ముందుకు సాగుతుంది. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తూ పలు పాఠశాలలు, కళాశాలలో మహనీయులు నేతాజీ సుభాష్ చంద్రబోస్, అబుల్ కలాం ఆజాద్, లాల్ బహదూర్ శాస్త్రి, మహాత్మా గాంధీ లాంటి ఎందరో మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలలో నిర్వహిస్తూ నేటి తరానికి మహనీయుల జీవిత చరిత్రను తెలియజేస్తున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తూ వాటి పరిష్కారం దిశగా విశేష కృషి చేస్తున్నారు. ఎంతో మంది బాధితులు, పీడుతులకు అండగా నిలుస్తూ న్యాయం చేకూరేలా తన సేవలను అందిస్తున్నారు.అలాగే కరోనా కష్టకాలంలో పలు కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు, లాక్ డౌన్ లో నిరాశ్రయులకు ఆహారం, శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేసి వారిలోని మానవత్వాన్ని చాటుకున్నారు.మత సామ్రాస్యాన్ని పెంపొందిస్తూ నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె అహ్మద్ ఇంటా ప్రతి ఏటా గ్యార్మి షరీఫ్ సందర్భంగా హిందూ ముస్లిం సోదరులతో అలాయ్ బలై వంటి మతసామ్రస్యాన్ని చాటే కార్యక్రమాలను నిర్వహిస్తూ అహ్మద్ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. అలానే ప్రతి ఏటా శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు వాటర్ బాటిల్స్, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు,ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు తన సంఘం సభ్యులతో కలిసి అందజేస్తున్నారు. అదేవిధంగా ప్రతి యేట నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని పలు ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ, నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరివాడిగా పేరుగాంచారు.ప్రతి ఏటా చలికాలంలో నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ, ఎండాకాలంలో చిరు వ్యాపారులకు గొడుగులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేసి ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తన సంఘం ద్వారా గౌరవిస్తూ సత్కరిస్తున్నారు. ఇలానే మరెన్నో మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో, ఎటువంటి స్వార్థం లేకుండా, నిరుపేదలకు భాధితులకు, పీడితులకు, నిస్సహాయులకు అండగా నిలుస్తూ విజయవంతంగా 33 సంవత్సరాల సుధీర్గ సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 34వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేతాజీ యువజన సంఘం సేవలు సరిలేరు నీకెవరూ సాటి అని అనిపించుకుంటుంది.

### ››› ఎస్.జె.కె.అహ్మద్ కు ప్రశంసల వెలువ....

నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె.అహ్మద్ గత 34 ఏళ్లుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ నేతృత్వంలో సాగుతున్న సేవా కార్యక్రమాలను పలువురు ప్రముఖులు పలు సందర్భాల్లో వారి అభినందనలు తెలియజేశారు. వారిలో 2024 స్వతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకోగా అహ్మద్ సేవలను నాటి భద్రాద్రికొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ అభినందించారు. టిఎస్ఆర్టిసి మాజీ ఎండి సజ్జనార్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేష్ నారాయన్, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ కిసాన్ మోర్చ జాతీయ అధ్యక్షుడు సుభాష్ బిహారి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జాతీయ కార్యదర్శి ఆర్. వి ప్రసాద్ తోపాటు వివిధ శాఖల జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఉన్నతాధికారులతో అహ్మద్ ప్రశంసలు అందుకున్నారు.







# జేబీపీ పోరాటంతో డీపీఆర్ రద్దు

- అవినీతి ఆరోపణలపై విచారణ ఎప్పుడు?



**పాల్వంచ, ఆగస్టు 13 (ప్రజాజ్యోతి ):** కొత్తగూడెం కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) కొనసాగిస్తున్న ప్రజా పోరాటానికి మరోసారి విజయం లభించిందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. జేబీపీ పోరాటం నేపథ్యంలో డీపీఆర్ టెండర్ రద్దు కావడం ప్రజా ఉద్యమానికి లభించిన ప్రాథమిక విజయమని పేర్కొన్నారు.పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యెర్రా కామేష్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, పారదర్శకతకు తావులేకుండా అధికారులు వ్యవహరిస్తే ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. న్యాయబద్ధంగా, నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడితే చివరకు అధికార యంత్రాంగం సైతం ప్రజా డిమాండ్లకు తలవంచాల్సిందేనని స్పష్టం చేశారు.

### ››› టెండర్ రద్దుతో కథ ముగిసినట్టేనా? //

డీపీఆర్ టెండర్ రద్దు చేయడంతో సమస్య పూర్తయినట్లు అధికారులు భావించకూడదని యెర్రా కామేష్ అన్నారు. టెండర్ ప్రక్రియలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "టెండర్ రద్దు చేసి చేతులు దులుపుకోవడం కాదు.. అసలు తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే అది ప్రజలను మోసం చేయడమే" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

### ››› విజిలెన్స్‌కు ఫిర్యాదు.. రికార్డులు పరిశీలించాలి //

డీపీఆర్ టెండర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించారా? లేదా? అనే అంశంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన కోరారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై డైరెక్టర్ జనరల్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తెలంగాణ విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే ఏ ప్రయత్నాన్నైనా జేబీపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, టెండర్ ప్రక్రియలు, ప్రజా నిధుల వినియోగంపై పార్టీ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని అన్నారు.

### ››› బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం //

"డీపీఆర్ టెండర్ రద్దు ప్రజా పోరాటానికి వచ్చిన ప్రాథమిక విజయం మాత్రమే. అసలు బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే పూర్తి న్యాయం జరిగినట్లు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని ప్రజా ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని యెర్రా కామేష్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జేబీపీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, పాల్వంచ, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు నిట్టా నర్సింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కర్మకు హాజరైన బీఆర్ఎస్ కార్పొరేటర్

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బత్తుల మధుచంద్.



**పాల్వంచ, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి):** పాల్వంచ సామాజిక కార్యకర్త దున్నపోతుల వెంకటేశ్వర్లు దశదిన కర్మ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ హాజరై నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన బత్తుల మధుచంద్.. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వాసుమల్ల గౌతమ్, తుంగపాటి లక్ష్మీనారాయణ, అల్లి సాయికిరణ్, పోలంపల్లి సాయితేజ, సాక్షి ఏజెంట్ దున్నపోతుల రాజు, శివరాత్రి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

- రాజకీయ చరిత్రలోనే అరుదైన ఘట్టం
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పటి వరకు 21సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జండా ఆవిష్కరణ
- నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం
- 4 ప్రభుత్వాల సాక్షిగా ఒకే గౌరవం
- ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు చెయ్ చెయ్



కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 13, (ప్రజా జ్యోతి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు.ప్రజాస్వామ్యంలో దేశంలో రాజకీయాల్లో పార్టీలు మారతాయి... ప్రభుత్వాలు మారతాయి... కానీ ఒక నేత పట్ల ప్రజావిశ్వాసం మాత్రం చెక్కు చెదరలేదు! తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో ఇది అక్షర సత్యం. ఈ నేపథ్యంలోనే స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా ఆయనకే దక్కుతూ వస్తోంది. ఇప్పటికే 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న తుమ్మల, ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇదొక సరికొత్త ఘట్టంగా నిలవనుంది.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేయడం ప్రతి నేతకూ లభించే గౌరవం.అలాంటి అరుదైన అవకాశం తుమ్మలకు ఏకంగా 20 సార్లు దక్కడం, ఈనెల 15న 21వ సారి దక్కనుండటం విశేషం.

**>>> నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు...**

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి దాదాపు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన, ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా వ్యవహరించారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు–భవనాలు, ప్రొహిబిషన్–ఎక్సైజ్, మేజర్–మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలను నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**>>> ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా....**

రాజకీయ ప్రస్థానంలో తుమ్మల ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఈ సుదీర్ఘ ప్రజా జీవితంలో మంత్రిగా ఉన్న దాదాపు ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసిన ఘనత ఆయనది. వేర్వేరు రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వాల మార్పుల మధ్య కూడా ఈ గౌరవం వరుసగా దక్కడం ఆయన సుదీర్ఘ ప్రజాజీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**>>> 20 సార్లు జెండా ఆవిష్కరణ ఇప్పుడు 21వ సారి...**

1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున ఇప్పటివరకు 20 సార్లు తుమ్మల నాగేశ్వరరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 15న 21వసారి ఈ గౌరవం దక్కడం రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయనకు, తన సొంత ప్రాంతానికి ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ బాధ్యత దక్కడం విశేషంగా చెప్పుకోవచ్చు.

**>>> రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం....**

పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధిగా తన స్థానాన్ని పదిలంగా నిలుపుకుంటూ వస్తున్న తుమ్మల నాగేశ్వరరావు రికార్డు, ఉమ్మడి రాష్ట్రరాజకీయ చరిత్రలో అరుదైనదిగా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. నలుగురు ముఖ్యమంత్రుల పాలనా కాలాల్లో ప్రభుత్వం తరఫున జాతీయ పతాకావిష్కరణ చేసిన అనుభవం చాలా తక్కువ మంది నేతలకు మాత్రమే దక్కుతుంది. ఈ కోణంలో చూస్తే, తుమ్మల నాగేశ్వరరావుది నిరాటంకమైన, స్థిరమైన రాజకీయ జీవితానికి నిదర్శనంగా నిలుస్తోంది.

**ఇప్పటివరకు తుమ్మల జాతీయ పతాకావిష్కరణ చేసిన సంవత్సరాలు**

1985, 1986, 1987, 1988, 1989, 1995, 1996, 1997, 1998, 1999, 2000, 2001, 2002, 2003, 2015, 2016, 2017, 2018, 2024, 2025



## గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి బలం

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భువన సుందర్ రెడ్డి



**పాల్వంచ, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి):**కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు.పీసీసీ, డీసీసీ అధ్యక్షుల పిలుపు మేరకు గురువారం మండలంలోని దంతెలబోర, దంతెలబోర ఎస్సీ కాలనీ, బంధ్రుగొండ, సంఘం, నారాయణరావుపేట ఎస్సీ కాలనీ, నగరం, రంగాపురం, కేశవపురం, తొగ్గూడెం, సంగం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు.స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటుపై చర్చించారు.ఈ సందర్భంగా భువన సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ కమిటీలే కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాదులని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను విస్తృతం చేసి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. పేదలు, రైతులు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో కొత్తగూడెం ప్రాంతం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమన్వయంతో జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని తెలిపారు.గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, కోఆపరేటివ్ డైరెక్టర్ చెవుగాని పాపారావు, నగరం సర్పంచ్ స్వప్న, ఉపేందర్‌తో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## 18న చర్లలో జిల్లా అథ్లెటిక్స్ పోటీలు



**చర్ల, ఆగస్టు 13 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. మహీధర్ తెలిపారు. చర్లలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల రోడ్డులో ఉన్న చర్ల స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఈ ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను జిల్లా తరఫున తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 26, 27 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.జిల్లా స్థాయి ఎంపిక పోటీలను అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించనున్నారు. 60 మీటర్లు, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.జిల్లాలోని అథ్లెటిక్స్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 18న ఉదయం 8 గంటలకు చర్ల స్టేడియంలో అథ్లెటిక్స్ కోచ్ జె. గిరి ప్రసాద్‌కు రిపోర్ట్ చేయాలని కోరారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు సమయానికి చేరుకుని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం అథ్లెటిక్స్ కోచ్ జె. గిరి ప్రసాద్‌ను 8522067157 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## గురుకులాల టెండర్లలో అక్రమాలను అరికట్టాలి

- విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి సరఫరా చేయని టెండర్ దారులను బ్లాక్ లిస్టులో పెట్టాలి
- సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారికి పీ డి ఎస్ యు వినతిపత్రం



**కొత్తగూడెం, ఆగస్టు 13, (ప్రజాజ్యోతి):**సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో టెండర్లు, కొనుగోళ్ల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, విద్యార్థుల సంక్షేమానికి కేటాయించిన నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని పీ డి ఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు గురువారం సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి అపర్ణకు పీ డి ఎస్ యు నాయకులు వినతిపత్రం అందజేశారు. గురుకులాల్లో టెండర్ల ప్రక్రియ, వస్తువుల కొనుగోళ్లు, సరఫరాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా పీ డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు బి. వీరభద్రం మాట్లాడుతూ.. టెండర్ దారులు, ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారుల మధ్య కుమ్మక్కు జరుగుతోందనే ఆరోపణలు, అధిక ధరలకు కొనుగోళ్లు, నాణ్యత లేని సామగ్రి సరఫరా వంటి ఫిర్యాదులపై స్వతంత్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**>>> టెండర్ రికార్డులపై సమగ్ర పరిశీలన ...**

టెండర్ పత్రాలు, ఎల్1, ఎల్2 వివరాలు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, సరఫరా వివరాలను పారదర్శకంగా పరిశీలించాలని కోరారు. కేవలం కార్యాలయ రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫిజికల్ వెరిఫికేషన్, నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు సరఫరా చేయాల్సిన వస్తువులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా? టెండర్ లో పేర్కొన్న పరిమాణంలోనే సరఫరా జరిగిందా? అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

**>>> అక్రమాలు రుజువైతే కఠిన చర్యలు ...**

విద్యార్థుల సంక్షేమం కోసం కేటాయించిన ప్రజాధనం దళారులు, కాంట్రాక్టర్ల జేబుల్లోకి వెళ్లే పరిస్థితిని అనుమతించబోమని పీ డి ఎస్ యు నాయకులు హెచ్చరించారు.విద్యార్థులకు సక్రమంగా, నాణ్యతా ప్రమాణాలతో సామగ్రి సరఫరా చేయని టెండర్ దారులను గుర్తించి బ్లాక్ లిస్టులో పెట్టాలని, అక్రమాలు రుజువైతే సంబంధిత అధికారులు, టెండర్ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గురుకులాల కొనుగోళ్లలో పూర్తిస్థాయి పారదర్శకత తీసుకురావడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి కేటాయించిన ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పీ డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు వీరభద్రం కోరారు.

# భ్రష్టు పట్టిస్తున్నది..
# జిల్లా అధ్యక్షులేనా..?

- కేంద్రంతో పాటు పలు రాష్ట్రాల్లో దూసుకుపోతున్న కమలం
- భద్రాద్రిలో వరుస నాయకత్వ మార్పులు.. ఆశించిన స్థాయిలో ఎదగని పార్టీ
- జీవీకే మనోహర్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోనేరు చిన్ని, రంగా కిరణ్ నాయకత్వాలపై పార్టీలో చర్చ
- కేడర్ ఉన్నా.. నాయకత్వ సమన్వయం లేక వెనుకబడు తోందనే విమర్శలు
- పార్టీని బలోపేతం చేయాల్సిన వారే బలహీ నతకు కారణమవుతున్నారనే ఆరోపణలు



**కేంద్రంలో అధికారంలో ఉండటంతో పాటు పలు రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ నినాదంతో బీజేపీ దూసుకుపోతున్నా.. అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా మొదలుకొని ఇప్పటి ప్రత్యేక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం పార్టీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 13, ప్రజాజ్యోతి :** జిల్లాలో బీజేపీకి క్షేత్రస్థాయిలో కేడర్, కొంతమేర ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ.. దానిని రాజకీయ బలంగా మార్చడంలో జిల్లా నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి. దీంతో గత కొంతకాలంగా జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన నాయకుల పనితీరుపైనే పార్టీలో చర్చ జరుగుతోంది.

### ♦ మారుతున్న అధ్యక్షులు.. మారని పరిస్థితి

గత 15 ఏళ్లుగా ఉమ్మడి జిల్లా, కొత్తగూడెంకు సంబంధించిన నాయకులే జిల్లా అధ్యక్షులుగా కొనసాగుతున్నారనే చర్చ ఉంది. 2012 నుంచి జీవీకే మనోహర్ కొనసాగగా.. అనంతరం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఆ తర్వాత బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సుమారు రెండు పర్యాయాలు 2020 వరకు బాధ్యతలు నిర్వహించారు. ఈ మధ్యలో 2018 సాధారణ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడి హోదాలో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి 1,466 ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. ఇది 0.85 శాతం ఓటు వాటాగా నమోదైంది. ఈ ఫలితం.. జిల్లా అధ్యక్షుడి నాయకత్వ ప్రభావంపై అప్పట్లోనే పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. భారతదేశంలో బీజేపీ తరుపున పోటి చేసిన అభ్యర్థుల్లో ఇదే అత్యల్ప ఓట్లు గా నిలిచిందనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. అనంతరం 2020 నుంచి 2023 వరకు కోనేరు సత్యనారాయణ (చిన్ని) బాధ్యతలు చేపట్టారు. మధ్యలో కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల ఈ స్థానం సుమారు ఏడాది పాటు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. తర్వాత సుమారు ఏడాదిన్నర పాటు రంగా కిరణ్ కొనసాగగా.. ప్రస్తుతం ముచ్చటగా మూడోసారి తిరిగి బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే అధ్యక్షులు మారుతున్నా.. జిల్లాలో పార్టీ బలం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్దోగొప్పో చిన్ని హయాంలోనే పరిస్థితి కొంత పరవాలేదనిపించినా.. మిగిలిన వారు కేవలం ఆ హోదాను అలంకారప్రాయంగానే నిర్వహించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. నాయకత్వం మారిన ప్రతిసారీ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని పైస్థాయి నాయకులకు చెప్పడమే తప్ప.. ఆ స్థాయిలో నిరంతర కార్యాచరణ కనిపించకపోవడం కేడర్‌లో మరింత అసంతృప్తికి కారణమవుతోందనే అభిప్రాయాలు ఉన్నాయి.

### ♦ కేడర్ ఉన్నా.. దిశానిర్దేశం కరువు

భద్రాద్రి జిల్లాలో కాంగ్రెస్, సీపీఐ, బీఆర్‌ఎస్ వంటి పార్టీలకు బలమైన రాజకీయ పునాదులు ఉన్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు ఆయా పార్టీలకు నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటున్నారు. దీనికి పోటీగా బీజేపీ కూడా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాల్సి ఉన్నా.. ఆ స్థాయిలో మాత్రం కార్యాచరణ కనిపించడం. పార్టీకి అందుబాటులో ఉన్న కేడర్‌ను సమన్వయం చేయడం, నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం, ప్రజా సమస్యలను రాజకీయ అంశాలుగా మలచడం వంటి విషయాల్లో జిల్లా నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సి ఉన్నా.. ఆ దిశగా అసలు ఆలోచించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన పనితీరుపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడంలో, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆశించిన స్థాయిలో చురుకుదనం లేదని, మొత్తం 'మత్తు' గా ఉందని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన నాయకత్వం బలహీనంగా 'ఉగిసలాడుతోందనే' ఆరోపణలు వినిపిస్తున్న సమయంలో.. తాజాగా కార్పొరేషన్ ఎన్నికల నిధులు, టికెట్ల కేటాయింపుపై వచ్చిన ఆరోపణలు మరింత చర్చకు దారితీస్తున్నాయి.

### ♦ అధిష్ఠానం దృష్టి పెట్టాల్సిందే..

కేంద్రంలో బీజేపీ విస్తరిస్తున్న సమయంలో భద్రాద్రి కొత్తగూడెం వంటి రాజకీయంగా కీలకమైన జిల్లాలో పార్టీ ఎందుకు ఆశించిన స్థాయిలో ఎదగడం లేదనే అంశంపై అధిష్ఠానం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేడర్ బలాన్ని నాయకత్వం సద్వినియోగం చేసుకోకపోతే.. పార్టీకి ఉన్న అవకాశాలు ఇతర పార్టీలకు అనుకూలంగా మారే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. అధ్యక్షులు మారుతున్నా పరిస్థితి మారకపోతే.. సమస్య కేడర్‌లోనా, లేక నాయకత్వంలోనా అనే ప్రశ్నకు పార్టీ అధిష్ఠానం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోందనే చర్చ జిల్లాలో సాగుతోంది.

# ఆటో కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**చర్ల, ఆగస్టు 13(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం తేగడ గ్రామానికి చెంది న శ్రీ గణేష్ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు తెల్లమల్ల అజయ్ కుమార్ మృతి యూనియన్‌కు తీరని లోటని శ్రీ గణేష్ ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు పామరు బాలాజీ అన్నారు. గురువారం అజయ్ కుమార్ దశదిన కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ తరఫున రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అజయ్ కుమార్ సుమా రు 40 సంవత్సరాలుగా ఆటో డ్రైవర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు ప్రజలతో మంచి సం బంధాలు ఏర్పరుచుకుని అందరి మ న్ననలు పొందారని అలాంటి మంచి మన సున్న వ్యక్తిని కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. ఆయన సేవలను ఆటో కార్మికులు ఎప్పటికీ మరువరని అన్నారు .చర్ల మండలంలో సుమారు 400 మంది ఆటో కార్మికులు ఆటోల ను నడుపుతూ జీవనం సాగిస్తున్నారని మూడు చక్రాల వాహనం రోడ్డుపై తిరిగితేనే కుటుంబ పోషణ సాగించే పరిస్థితి ఉందని అన్నారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరా రు. కార్మికులకు సంక్షేమ పథకాలు, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.భద్రాచలం



ఏజెన్సీ ప్రాం తంలో శ్రీ గణేష్ ఆటో యూనియన్ మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుందని బాలాజీ తెలిపారు. ఏ ఆటో డ్రైవర్‌కు కష్టం వచ్చినా యూనియన్ సభ్యులంతా ఒక్కతాటిపై నిలబడి సమ స్య పరిష్కారం కోసం అండగా ఉంటారని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీ ఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు, యూనియన్ కార్యదర్శి కోడిరెక్కల నాగరాజు, ఉపాధ్యక్షులు బాలరాజుల సత్తిరాజు, ఉపకార్యదర్శి చల్లా అశోక్ కుమార్, కోశాధికారి కుక్కడాపు రాంబాబు, ట్రెజరర్ రాముల పోతురాజు, స్టీరింగ్ కమిటీ సభ్యులు దొంతు ప్రసాద్, బతుల గురునాథ రావు, కోడిరెక్కల వెంకటరమణ, మండల కమిటీ సభ్యులు పుగాకు నాగేంద్ర, కొంగ రాజు, మైప శ్రీకాంత్, గుల్లిపల్లి పవన్, బొంతు బన్నీ,నక్క వెంకటేశ్వర్లు,రామచంద్ర రావు, గోలి వినయ్, బట్ట వంశీ, వాళ్లేపోగు విజయ్, కొపుల రామ కృష్ణ, గుండారపు నరసింహ తదితరులు పాల్గొన్నారు.